సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 12 । జూలై । 2025



వాటా కోసం.. తమ్ముళ్ల కుమ్ములాట

టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న సంస్థకు ఖనిజం సరఫరా చేసే విషయంలో వాటా కోసం తమ్ముళ్ల మధ్య కుమ్ములాట మొదలైంది. - 8లో



అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేని ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.260	రూ.330
రెండోరకం	రూ.180	రూ.240



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1016 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	600	600
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 124.020 కిలోలు

చినుకు.. కినుకు

- అనుకూలించని వర్షాలు
- మందగించిన రుతుపవనాలు.
- 30 మండలాల్లో కరువు ఛాయలు.
- అయోమయంలో రైతులు.



చిన్నమండెం మండలం మల్లూరు వద్ద ఎండిపోతున్న జొన్న పంట



గాలివీడు మండల పరిధిలో కాస్త వర్షానికి విత్తిన వేరుశనగ విత్తనాలు మొలకెత్తక బీడుగా కనిపిస్తున్న దృశ్యం

రాయచోటి : రైతులకు ఖరీఫ్ సాగును పండుగ వాతావరణంలా పరిగణిస్తారు...ముంగారు వర్షాలతో మురిసిపోతూ..కాడెద్దులను సిద్ధం చేసి.. మూలన పెట్టిన వ్యవసాయ పనిముట్లను బయటకు తీసి సేద్యానికి సిద్ధమవుతారు.ఈ ఏడాది ముంగారు వర్షాలతో ఆశల పల్లకిలో ఊరేగిన రైతులకు ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రుతుపవనాలు దోబూచులాడుతుంటడంతో ఆందోళన చెందుతున్నారు... ఉదయం లేచినప్పటి నుంచి సాయంత్రం వరకు ఆకాశమంత కారు మబ్బులు కమ్ముకుంటున్నాయి.అయినా చినుకు జాడ లేదు. జూలై మాసంలో జిల్లాలోని భూములు పచ్చని పంట పొలాలతో కనిపించాల్సి ఉన్నా వరుణుడి కరుణ లేక బీడుబారాయి.

2754 హెక్టార్లలోనే పంటల సాగు

మే జూన్ నెలలో దుక్కులు దున్ని విత్తనం వేయడానికి సన్నద్ధం చేసి వర్షాల కోసం ఎదురుచూసే పరిస్థితి. జిల్లాలో వర్షాలు లేక తడి లేని పొలాలు, పచ్చగడ్డి లేని గట్లు, మేతలేక బక్కచిక్కిన పశువులు, అన్ని చినుకు కోసం ఎదురుచూస్తున్నాయి. సాగునే నమ్ముకున్న రైతుల్లో తీవ్ర నిరాశ స్పృహలు మొదలయ్యాయి. వర్షం ఎప్పుడు వస్తుందో అంచనా వేయలేక పోతున్నారు. జిల్లాలో 30 మండలాల్లో ఖరీఫ్ సీజన్ లో 62 వేల హెక్టార్లకు 2754 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగై 4.18 శాతంగా నమోదైంది. వరి 12 వేల హెక్టార్లకు 525 హెక్టార్లలో, వేరుశనగ 40 వేల హెక్టార్లకు 1582 హెక్టార్లలో, కంది 2404 హెక్టార్లకు 69 హెక్టార్లలో సాగయ్యాయి.ఉలవ, రాగి పంటలు సాగుకు నోచుకోలేదు.

ఈ పొలాలు వర్షపు చినుకు కోసం పరితపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భూమిలో వేసిన విత్తనాలు ఇంకా మొలకెత్తడం లేదని రైతులు మదనపడుతున్నారు. తొలకరిలోనే వరుణుడు ముఖం చాటేశాడు. ఫలితంగా జిల్లాలో పంటల సాగు సాధారణ సాగులో 4.18 శాతానికి పడిపోయింది.

జూన్ 1 నుంచి 30 మధ్య సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. జూన్ నెలలో 147 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదు కాగా జులై నెలలో మైనస్ 83.5 శాతం మేర వర్షపాతం లోటు నమోదయింది. జూన్ చివరి వారంలో చాలా తక్కువ వర్షపాతం నమోదయింది. జిల్లాలో 30 మండలాల్లో వర్షా భావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ నెలలో కేవలం మూడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తంగా గత ఏడాది నైరుతి ప్రవేశించినప్పటి నుంచి అంటే జూన్ 1 నుంచి అవి నిష్క్రమించే సెప్టెంబర్ 30 వరకు జిల్లాలో అనుకూల వర్షం కురిసింది. ఈ ఏడాది జూన్ మాసంలో 83 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రుతుపవనాలు అంచనాలకు ఏమాత్రం అందడం లేదు. దేశంలో నైరుతి రుతుపవనాలు ముందుగా ప్రవేశించాయి. వచ్చిన తర్వాత వేగంగా విస్తరించకుండా ఒకే చోట ఉండిపోయాయి. తర్వాత పుంజుకుని ఉత్తరాదికి వ్యాపించాయి. దీంతో మధ్య వాయువ్య భారతంలో కుంభవృష్టి వర్షాలు కురిసినా జిల్లాలో వర్షపు జాడలేదు. ప్రస్తుతం రైతాంగం అంతా జూలై మాసం పైనే ఆశలు పెట్టుకుంది. ఈ మాసంలోనైనా గట్టి వానలు పడితే పంటలపై ఆశలు చిగురిస్తాయి. జిల్లాలో ఇప్పటిదాకా వేరుశనగ, వరి టమోటా, కంది జొన్న తదితర పంటలు సాగు విస్తీర్ణం 4.18 శాతం కూడా దాటలేదు. వానాకాలంలో కనీసం లక్షన్నర ఎకరాల్లో వేరుశనగ, వరి ఇతర పంటలను సాగు చేస్తారు. ఈసారి పరిస్థితులు తారుమారయ్యాయి. ఇతర పప్పు ధాన్యాలు నూనె గింజల సాగు విస్తీర్ణం కూడా ఆశాజనకంగా లేదు. వర్షాకాలంలో మైనస్ 83.5 వర్షపాతం లోటు నమోదైంది. రుతుపవనాలు చురుగ్గా ఉన్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా వర్షాలు తక్కువగా ఉన్నాయి. విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం లేనందున పంటల సాగు తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

రుతుపవనాల దాగుడుమూతలు

వర్షాధారంగా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా రైతులకు రుతుపవనాలు దాగుడుమూతలు ఆడుతున్నాయి. ఇక్కడ ఎక్కువ వర్షాలు కురుస్తాయని వారం రోజుల్లో తుపాను ఏర్పడుతుందని ఐఎండీ శాస్త్రవేత్తలు చెబుతున్నా గాలి అధికం కావడంతో మేఘాలు వర్షించే అవకాశాలు ఉండవని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈసారి రుతుపవనాలు ముందుగా వచ్చినా లాభం లేదు. జిల్లాలో కొందరు రైతులు వర్షాలపై ఆధారపడి తమ కార్యకలాపాలు ప్రారంభించారు. వేల రూపాయల ఖర్చు చేసి పొలాలను దుక్కి చేసుకున్నారు. సాగుకు అవసరమైన విత్తనాలను అప్పులు చేసి కొనుగోలు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలు రాకపోవడంతో విత్తనాలు, ఎరువుల కోసం పెట్టిన పెట్టుబడులు నష్టపోవాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ సిహెచ్.రామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మూడు ప్రభుత్వ, పన్నెండు ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌లకు సంబంధించి సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఐటీఐల్లో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే మెరిట్ జాబితాలోకి వస్తారని తెలిపారు. అభ్యర్థులు ఏ ఐటీఐలో ప్రవేశం కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటారో అక్కడే ఈనెల 21వ తేదీ వారికి కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

రైళ్లలో ఆకస్మిక తనిఖీలు



రైలు బోగిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రాజంపేట : జిల్లాలో నడిచే పలు రైళ్లలో శుక్రవారం పోలీసులు, రైల్వేపోలీసులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు తనిఖీలు జరిగాయి. చెన్నై-ముంబై మధ్య నడిచే సూపర్‌ఫాస్ట్ రైళ్ల బోగీలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి,మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమరవాణా అరికట్టేందుకు తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972కు, 112కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లాలోని మదనపల్లె మండలం వలసపల్లి గ్రామం, రాజంపేట మండలం నరమరాజుపల్లి గ్రామాల్లో ఉన్న శ్రీ జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసం డిసెంబర్ 13వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. ఈవిషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన 2025-26 విద్యా సంవత్సరం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమాచార హక్కు కమిషనర్‌కు ఫిర్యాదు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంపై సమాచార హక్కు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాలపోగు సంపత్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాయచోటిలో సమాచార హక్కు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన పత్రాలను పత్రికలకు అందజేశారు. సమాచారం కోసం జిల్లా ఎస్పీ కార్యాలయంలో రైట్ ఇన్‌ఫర్మేషన్ యాక్టు 2005 ప్రకారం సమాచారం ఇవ్వాలని కోరామన్నారు. తాము అడిగిన సమాచారం ఇవ్వకపోవడంతో సమాచార హక్కు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరికీ రూ.307 రావాలి



కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రాయచోటి టౌన్ : జాతీయ ఉపాధి హామీ పనుల్లో ప్రతి కూలికి కనీసం రూ.307లు వచ్చే విధంగా చూడాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం రాయచోటి రూరల్ పరిధిలోని వరిగపాపిరెడ్డి గారిపల్లెలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కుంటలో పూడిక తీత, మామిడి మొక్కల పెంపకం పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కూలీలకు కనీస వసతులు కల్పించాలని చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 50 ఎకరాల్లో మొక్కల పెంపకం జరిగే విధంగా చూడాలని తెలిపారు.అనంతర కూలీల మస్టర్‌ను పరిశీలించారు. ఏపీవో రమేష్, టీఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల అనుబంధ పీజీ కళాశాలల రెండో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావుతో కలసి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వైవీయూపీజీ కళాశాల కేంద్రాన్ని వారు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 653 మంది పరీక్షలకు హాజరు కాగా 21 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : రెవెన్యూ శాఖలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆర్డీవో మధుసూధన్ రావుకు సూచించారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో, ఎంపీడీవో సురేష్ బాబుతో కలసి వారి శాఖల్లో వచ్చే సమస్యలపై చర్చించారు.అనంతరం మాట్లాడుతూ యువతకు ఉద్యోగ కల్పనకు కృషి చేయాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

– జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



రాయచోటి : ప్రజలు సంతృప్తి చెందేలా వైద్య సేవలు అందించడంతోపాటు వర్షాకాలంలో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందితో హెల్త్ పారామీటర్స్, వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులు, ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం డయాబెటీస్, హైపర్ టెన్షన్, మెటర్నల్, నియోనేటల్ హెల్త్, తదితర అంశాల్లో అన్ని పీహెచ్‌సీలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనరసయ్య, డీపీఎంఓ డాక్టర్ రియాజ్ బేగ్, ప్రోగ్రామ్ అధికారి ఆర్‌బీఎస్‌కె డాక్టర్ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక



విద్యార్థులతో కేంద్రీయవిద్యాలయం ప్రతినిధులు

రాజంపేట : జాతీయస్థాయి క్రీడలకు కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మురగేశన్ శుక్రవారం తెలిపారు. కోచ్ రాహుల్ కుమార్, సహాయకోచ్ కుమారజర పాలా వీరికి శిక్షణ ఇచ్చారన్నారు.ఎంపికైన వారిలో మోక్షిత్(చెస్), హర్ష(టేక్వాండో), కార్తీక్, మహేష్ (కబడ్డీ), ఉదయశంకర్ (డిస్కస్‌త్రో) ఉన్నారని చెప్పారు. జిల్లాస్థాయి క్రీడలకు అండర్-14 విభాగంలో నాగలక్ష్మీప్రియ, హరిత, అండర్-17లో హర్షిత, రిషి, గాయత్రి, అండర్ -19లో మోహనావైష్ణవి, యశస్విని ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మురగేశన్ అభినందించారు.

ఆరోగ్యకరమైన కుటుంబం శ్రేయస్కరం



ప్రపంచ జనాభా దినోత్సం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

రాయచోటి టౌన్ : ఆరోగ్యకరమైన కుటుంబం సమాజానికి శ్రేయస్కరమని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెళ్లికి కావాల్సిన వయస్సు మహిళలకు 18, పురుషులకు 21 సంవత్సాలు నిండి ఉండాలని చెప్పారు.ప్రణాళికబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం ఉండాలని తెలిపారు.కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో ఇన్‌చార్జి బలరామరాజు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఆర్ఎంవో కిరణ్, డీపీఎంఓ రియాజ్ బేగ్, డీఎస్ఎంవో విష్ణువర్ధన్ రెడ్డి,యుపీహెచ్‌సీ వైద్యులు ఎస్‌ఓ ఓబుల్ రెడ్డి, డీఎస్‌ఓ కరీముల్లా, రాజగోపాల్, పర్యవేక్షకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కమనీయం..సౌమ్యనాథుడి కల్యాణం



కల్యాణంలో మాంగల్యం చూపుతున్న ఆగమశాస్త్ర పండితులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

మారుమోగిన హరినామస్మరణ

నందలూరు : సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కల్యా వేదికను అలంకరించారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామిలు శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కల్యాణ వేదికపై కొలువుదీర్చారు.అనంతరం కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు క్రతువులను నిర్వహించారు.

భక్తుల హరి నామస్మరణలతో ఆలయం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. కల్యాణోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామిని ఆలయం చుట్టూ పల్లకీలో ఊరేగించారు. శుక్రవారం రాత్రి గజవాహనంపై స్వామివారు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. శనివారం ఉదయం రథోత్సవం నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అన్నదానం : కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కల్యాణం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట రూరల్ సీఐ బివి రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్రాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలు అందించారు.



గజవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

కవచ.. కవచ..

పట్టాలెక్కిన కవచ్ వ్యవస్థ

- ఆటోమెటిక్ బ్రేకులతో రైళ్ల 'ఢీ'కి బ్రేక్
- కిలోమీటర్‌కు రూ.50లక్షల వ్యయం

రాజంపేట : పట్టాలపై పరుగులు తీసే రైళ్లు ఎదురెదురుగా ఢీ కొనకుండా బ్రేక్ లు పడనున్నాయి. ప్రయాణికుల భద్రతాచర్యల్లో భాగంగా రైలు ప్రమాదాలు నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు చేపట్టారు భారతీయరైల్వేలో ఇప్పుడు రైళ్ల రక్షణ కవచ్ వ్యవస్థను పట్టాలెక్కించారు. అందుకు రైల్వేబోర్డు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ప్రయాణికులు అంటున్నారు.

కలవరపరుస్తున్న రైళ్ల ఢీ..

కవచ్ రక్షణ వ్యవస్థ లేని కారణంగానే ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలుప్రమాదం జరిగిందని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. రైళ్లు డేజంర్ సిగ్నల్ దాటుకొని ప్రయాణిచడంతో ఒకే లైన్‌పై ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్న సంఘటనలు ఉన్నాయి. ఆయా ఘటనల్లో పలువురు ప్రయాణికులు చనిపోవడంతోపాటు రైల్వేకు భారీ నష్టాలు చేకూరాయి. ఇలాంటి ప్రమాదాలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.





రైళ్ల ఢీ (ఇన్‌సెట్) రెలింజన్‌లో ఏర్పాటు చేసిన కవచ్ పరికరాలు

దశలవారీగా..

తొలుత డివిజన్‌లో గుంతకల్-డోన్ సెక్షన్‌లో రక్షక్ వ్యవస్థను ప్రవేశపెట్టి విజయవంతంగా నడిపిస్తున్నారు. అన్ని సెక్షన్లలో దీనిని దశలవారీగా అమలు చేయనున్నారు.

ఆటోమేటిక్‌గా బ్రేకులు...

కవచ్ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా రైళ్లలో మెక్రో ప్రాసెసర్లు, గ్లోబల్ పోజిషనింగ్ వ్యవస్థ (జీపీఎస్), యాంటీ కొల్లీషన్ పరికరాలను ఏర్పాటు చేస్తారు. వాటిని రైల్వే ట్రాక్‌లకు కూడా అనుసంధానిస్తారు. ఆయా స్టేషన్ల ఏర్పాటు చేసిన టవర్ల ద్వారా రైలింజన్‌లోని కవచ్ యాంటీనాల సహాయంతో సిగ్నిల్‌ను స్వీకరిస్తాయి, ఒకే ట్రాక్ మీదకు రెండు రైళ్లు పొరపాటున వస్తే మోడెమ్ సహాయంతో ఆటోమేటిగ్గా ఈ రెండు రైళ్లకు పరస్పరం సమాచారం అందుతుంది. ఆటోమేటిక్‌గా బ్రేకులు పడి రైలు నిలుచిపోతుంది.

- డివిజన్‌లో రైలుమార్గం 1450 కి.మీ పైగా విస్తరించి ఉంది. అందులో వాడి-రేణిగుంట, గుత్తి-ధర్మవరం, ధర్మవరం-పాకాల. పాకాల-కాట్పాడి, నంద్యాల-ఎర్రగుంట్ల, గుంతకల్లు-బళ్లారి సెక్షన్లలో దశలవారీగా ఏర్పాటు చేస్తున్నారు.

తొలుత డోన్ సెక్షన్‌లో...

గుంతకల్లు-డోన్ మధ్య ఉన్న 69 కిలో మీటర్లకు కిలోమీటర్‌కు రూ.50 లక్షల చొప్పన దాదాపు రూ.345 కోట్లు ఖర్చు చేశారు. ఈ మార్గంలో తిరిగే 20 నుంచి 30 రైలింజన్లలో కవచ్ పరికరాలను, టవర్లు ఏర్పాటు చేసి ట్రాక్‌కు అనుసంధానం చేశారు. అదేవిధంగా వాడి-రేణిగుంట మధ్య ఉన్న 538 కిలోమీటర్లకు దాదాపు 60 దాకా కవచ్‌లతోపాటు 200కు పైగా రైలింజన్లలో కవచ్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు.

కడప, అన్నమయ్య జిల్లాలో..

ప్రస్తుతానికి నాల్వర్-గుంతకల్-నందలూరు-రేణిగుంట (ముంబై-చెన్నై రై లుమార్గం)లో ఈ కవచ్ వ్యవస్థను తీసుకొచ్చారు. నాల్వర్ కర్ణాటక రాష్ట్రంలో ఉన్నప్పటికీ అధిక మొత్తం రాయలసీమ రైలుమార్గంలో కవచ్ ఉండనుంది. అనంతపురం, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాలలో పరిధిలో రైలుమార్గాన్ని కవచ్ వ్యవస్థకు ఎంపిక చేశారు. ఫలితంగా డివిజన్‌లో దీని ఏర్పాటుకు సంబంధించిన పనులు చకచకా జరిగిపోతున్నాయి.


ప్రయాణికుల భద్రతే ధ్యేయం



ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా రైల్వేశాఖ చర్యలు తీసుకోవడం అభినందనీయం, రైళ్లు ఢీ కొని అనేక మంది ప్రయాణికులు ప్రాణాలు పొగుట్టుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. కవచ్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చు. ప్రయాణికులు భద్రతపై సాంకేతిక పరిజ్ఞానంతో మరింత ముందుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి

– పీవీ మిధున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

త్వరితగతిన ఏర్పాటుచేయాలి



ముంబై-చెన్నై కారిడార్ రైలుమార్గం భారతీయ రైల్వేలో ప్రధానమైనది. గుత్తి -రేణిగుంట మార్గంలో కవచ్ వ్యవస్థను త్వరితగతిన ఏర్పాటుచేయాలి. ఆ దిశగా రైల్వేబోర్డు చర్యలు తీసుకోవాలి. రైళ్ల ఢీ కొన్న సంఘటనలు గుర్తు చేసుకుంటేనే బాధ కలుగుతుంది. ప్రమాదాలు నివారించేందుకు రక్షణ కవచ్‌ను రైల్వే తీసుకురావడం అభినందనీయం.

– మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు,నందలూరు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో జింక మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జింక

రాయచోటి : రామాపురం మండలం పాలనగారిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జింక మృతిచెందింది. శుక్రవారం ఉదయం రాయచోటి నుంచి ద్విచక్ర వాహనంలో కొందరు కడపకు వెళ్తున్నారు. పాలన్నగారిపల్లి సమీపంలో చెట్లపొందల నుంచి జింక రోడ్డుమీదకు రావడంతో ఢీకొన్నారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు గాయాలపాలయ్యారు. గాయపడిన జింక కూడా మృతి చెందినట్లు అటవీబీట్ అధికారి భరణీధర్ తెలిపారు.

వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పిస్తున్న టూటౌన్ పోలీసులు

మదనపల్లె రూరల్ : రోడ్డుపై ఉన్న వృద్ధురాలిని పోలీసులు అనాథ ఆశ్రమానికి చేర్చి దాతృత్వం చాటారు. పట్టణంలోని సీటీఎం రోడ్డు ఎస్టేట్‌లో సుమారు 65 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధురాలు రోడ్డు పక్కన దిక్కుతోచని స్థితిలో ఉంది. స్థానికులు వివరాలు ఆరాతీయగా తన పేరు జయమ్మ, ప్యారంపల్లె గ్రామమని, తనకు నలుగురు కుమార్తెలున్నారని తెలిపారు. తనను పోషించలేక ఎస్టేట్‌లో వదిలి వెళ్లినట్లు తెలిపింది. స్థానికులు 112 కు కాల్‌చేసి సమాచారం అందిస్తే టూటౌన్ ఏఎస్‌ఐ వై.వి.రమణ ఘటనాస్థలానికి వెళ్లి వృద్ధురాలిని ఆనంద వృద్ధాశ్రమంలో చేర్చారు. జయమ్మ సంబంధీకుల ఆచూకీ తెలిసేంతవరకూ ఆశ్రమంలో ఉంచుకుని ఆలనాపాలన చూడాల్సిందిగా కోరారు. వృద్ధురాలికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే..9133006333, 9441169202, 9182276316 ఫోన్ నెంబర్లలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని అంకిశెట్టిపల్లెకు చెందిన కుమార్‌రెడ్డి కుమారుడు లోకేష్‌రెడ్డి(23)ని తల్లిదండ్రులు మందలించారని పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అదే విధంగా పోతబోలుకు చెందిన సాగర్‌రెడ్డి భార్య కృష్ణవేణి(27) అనారోగ్య కారణాలతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పట్టణంలోని వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న రెడ్డెప్ప భార్య ఎం.రాణి(32) రుణదాతల నుంచి ఒత్తిడి అధికం కావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం

వైఎస్సార్ సీపీ అన్నమయ్యజిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

మదనపల్లె రూరల్ : ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని వైఎస్సార్ సీపీ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మదనపల్లెలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ...వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లక్షల రూపాయల మేలు కలిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలన్నింటినీ అమలుచేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిడితో అరకొరగా తల్లికి వందనం అమలు చేశారన్నారు. మేనిఫెస్టో హామీల గురించి ప్రశ్నిస్తే నాలుక మందం అంటూ చంద్రబాబు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అన్నారు. ప్రతి గడపకు వెళ్లి జగన్, చంద్రబాబు మధ్య తేడా వివరించాలని సూచించారు. చిన్న మనస్పర్థలు పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్ తిప్పారెడ్డి మాట్లాడుతూ..చంద్రబాబు మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అన్నారు.



మదనపల్లెలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్, క్యూఆర్ కోడ్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నిసార్ అహ్మద్ మాట్లాడుతూ..జగనన్న హయాంలో ప్రజలు సుభిక్షంగా ఉండేవారని, బటన్ నొక్కితే ప్రజలకు డబ్బులు వచ్చేవన్నారు. చంద్రబాబు పాలనలో అవి లేకపోగా, ఆయన చేసిన మోసాలు ఒకొక్కటే ప్రజలకు తెలిసి వస్తున్నాయన్నారు.రాబోయే మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో మదనపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దామన్నారు. అనంతరం కడప మేయర్ సురేష్‌బాబు, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి. సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, అనీషారెడ్డి మాట్లాడారు. అనంతరం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్, క్యూఆర్ కోడ్‌లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మనూజారెడ్డి, షమీం అస్లాం, జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, సీహెచ్.రామచంద్రారెడ్డి, ఆర్‌ఐ.రమణారెడ్డి, వెలుగుచంద్ర, వెంకటరమణారెడ్డి, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్‌ఆజం, లియాఖత్‌అలీ, ఎస్.ఏ.కరీముల్లా, ఎన్‌ఆర్‌ఐ దండుశేఖర్‌రెడ్డి, శివప్రసాద్, హర్షవర్దన్‌రెడ్డి, ఇర్ఫాన్, బి.రేవతి, మేరీ, శీలంరమేష్, మునిశేఖర్, బండపల్లి వెంకటరమణ, పోతబోలునాగరాజ, ఈశ్వరయ్య, శరత్‌రెడ్డి, జన్నే రాజేంద్ర నాయుడు, ఆర్టీఏ నూర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం



ఒకే వేదికపై సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వాముల కల్యాణోత్సవం

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో శుక్రవారం సిద్ధేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవాలను వేర్వేరుగా వైభవంగా నిర్వహించారు. అన్నమాచార్య ధాన్య మందిరం ఆవరణలోని కళ్యాణ వేదికపై ముందుగా సిద్ధేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకరించి కొలువుదీర్చారు. ఒకే వేదికపై శివ, కేశవుల కళ్యాణం జరుగుతుండడంతో రాజంపేట పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కళ్యాణోత్సవానికి హాజరైన వారికి టీటీడీ అన్నప్రసాదం పంపిణీ చేసింది. సర్పంచి గౌరీ శంకర్, ఉద్దండం సుబ్రహ్మణ్యం, అదృష్టదీపుడు, టీటీడీ అధికారులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం : బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సిద్ధేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం తితిదే ఏర్పాట్లు చేసింది.

మూడేళ్ల జైలు శిక్ష

రాయచోటి టౌన్: హత్యాయత్నం కేసులో షేక్.అజాజ్(అలియాస్ పాపా)కు రాయచోటి అదనపు జిల్లా సీనియర్ జడ్జి ప్రసూన మూడేళ్ల జైలుశిక్ష, రూ.10,000ల జరిమానా విధించినట్లు రాయచోటి అర్బన్ పోలీసులు తెలిపారు. అర్బన్ సీఐ బివి.చలపతి కథనం మేరకు..05 జనవరి, 2022న రాయచోటి పట్టణంలోని రెడ్డిస్ కాలనీలో (కుమ్మరమిట్ట) బేతల్ కాలనీ వద్ద షేక్. హమీద్ రహిమాన్ అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన షేక్.అజాజ్ (అలియాస్ పాపా)ను చాకుతో పొడిచాడు. అప్పటి ఎస్ఐ మహమ్మద్‌రఫీ కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. శుక్రవారం కోర్టులో వాదనలు విన్న న్యాయమూర్తి ప్రసూనా నిందితుడు నేరానికి పాల్పడ్డాడని భావించి ఐపీసీ307 ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు రూ.10,000లు జరిమానా కూడా విధించారని తెలిపారు.

కూటమి మోసాలను ప్రజా కోర్టులో నిలబెడదాం

తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట/కురబలకోట : రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను నిలువునా దగా చేశారని, బాబు నయవంచన గురించి ఇంటింటా వివరించాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బి.కొత్తకోట పీఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. చంద్రబాబు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను నాయకులు ఆవిష్కరించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తంబళ్లపల్లెకు జగన్ ప్రభుత్వంలో మంజూరైన కోట్లాది రూపాయల నీటి పథకాలు, ముదివేడు రిజర్వాయర్ తదితర పథకాలను కూటమి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. వెనుకబడిన తంబళ్లపల్లెను తాము ప్రగతి పథంలో నిలిపామన్నారు. జగన్ పర్యటనల సందర్భంగా జన స్పందన చూసి కూటమి అధినాయకులు అదిరిపోతున్నారని ఆరోపించారు. అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశాడని, ఏవర్గం సంతృప్తికరంగా లేదన్నారు. జగన్ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరిగాయని, చంద్రబాబు పాలనలో మోసం గ్యారంటీ అని విమర్శించారు. అనంతరం ముఖ్య అతిథి ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, కొత్తగా చేరిన పార్టీ నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, పూర్ణ చంద్రిక, రమేష్, ఎంజి భూదేవి, నారాయణరెడ్డి, భాస్కర్ నాయుడు, అనిత చక్రవర్తి, బలరామిరెడ్డి, చౌడేశ్వర, మహమ్మద్, శివన్న, కళ్యాణ్, రెడ్డి హరి, తదితరులతో పాటు నియోజక వర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబు మోసాలపై క్యూర్ కోడ్ ఆవిష్కరిస్తున్న, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

చంద్రబాబు మాట.. అబద్ధాల మూట

కడప మేయర్ సురేష్‌బాబు, చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాట... అబద్ధాల మూట అని మరోసారి రుజువైందని మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, అన్నారు. స్థానిక ఎంఎం.కల్యాణమండపంలో బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ అంశంపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధరలేకల్పించలేదన్నారు. మామిడి రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని, గత ప్రభుత్వంలో రూ.16 నుంచి రూ.18 వరకూ గిట్టుబాటు కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం కిలో రూ.2కు కూడా కొనలేని పరిస్థితి ఉందన్నారు. కాయలు తోటల్లోనే వదిలేసి రైతులు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. చికెన్ వ్యాపారుల నుంచి కిలోకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, అరెస్ట్ చేయడం, పోలీసులను అడ్డుపెట్టుకుని రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఏ ఒక్కరినీ వదలిపెట్టబోమన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి పదవులు పొందిన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అనీషారెడ్డి, మైనారిటీ కమీషన్ చైర్మన్ ఇక్బాల్‌అహ్మద్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరసింహారెడ్డి, సుగవాసి సుబ్రమణ్యం, హరీష్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ఆగా మోహిద్దీన్, కన్వీనర్లు దండు జగన్మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, ముక్తియార్, శివారెడ్డి, వెంకటరమణారెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా. చక్రధర్, ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అకేపాటి అమరనాథ్‌రెడ్డి

ఎస్పీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె బుద్ధ విహార్‌లో విగ్రహం ధ్వంసం, తల తొలగించిన ఘటనకు సంబంధించి తప్పుడు కేసులు నమోదు చేయించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాద ఘటనపై, తాలూకా సీఐ కళా వెంకటరమణ నిర్వాహకుల ఫిర్యాదు స్వీకరించకుండా కేసు నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ఫౌండర్ పిటీఎం శివప్రసాద్, బౌద్ధులు శాంతియుతంగా దమ్మ దీక్ష చేశారన్నారు. దీనిపై ఎస్పీ అప్రజాస్వామికంగా వ్యవహరించి, నిందితులను అరెస్ట్ చేయకుండా శాంతియుతంగా దీక్ష చేస్తున్న వారిని అరెస్ట్ చేసేందుకు పోలీసులను పంపడాన్ని ఆయన తప్పుపట్టారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో పోలీసులు శివప్రసాద్‌పై అక్రమ కేసులు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చందు, కృష్ణప్ప, సాంబశివ, సహదేవ్, బాలాజీ, రమణ, శ్రీనాథ్, శివ,చంద్ర, ప్రశాంత్, మహేశ్, అరుణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బందెల గౌతమ్‌కుమార్‌కు విన్నవిస్తున్న నాయకులు

సమగ్ర శిక్ష శాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటిలోని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఫారిన్ సర్వీస్ నిబంధనలు, షరతులపై పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. సహాయ బాలికా శిష్యు అభివృద్ధి అధికారి(జీసీడీఓ), సహాయ బాలికా శిష్యు అభివృద్ధి అధికారి(జీసీడీఓ), సహాయ బాలికా శిష్యు అభివృద్ధి అధికారి(అసిస్టెంట్ జీసీడీఓ), సహాయ విద్యా సంబంధమైన పర్యవేక్షణ అధికారి (ఉర్దూ) పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోస్టుకు పీజీ డిగ్రీ అర్హత కలిగి, ఐదేళ్ల సర్వీసు కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, ఎనిమిదేళ్ల సర్వీసు ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లు దరఖాస్తు చేయాలన్నారు. సహాయ ప్రోగ్రాం ఆఫీసర్(ఏపీఓ) పోస్టులకు మాథ్స్/స్టాటిస్టిక్స్ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏలో పీజీ డిగ్రీ అర్హత ఉండాలన్నారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్(ఏఎస్ఓ) పోస్టులకు మాథ్స్/ స్టాటిస్టిక్స్‌లో పీజీ డిగ్రీ, గుర్తింపు పొందిన యూనివర్శిటీలో కంప్యూటర్ డిప్లమో/ డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. పై అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఈ నెల 18వ తేదీలోగా సంబంధిత ప్రధానోపాధ్యాయుని ద్వారా జిల్లా ప్రాజెక్టు అధికారి, సమగ్ర శిక్ష, రాయచోటి కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

వాటా కోసం.. తమ్ముళ్ల కుమ్ములాట

- సీఎండీ గ్రేడ్ ఖనిజం సరఫరాలో బెడిసిన ఒప్పందం
- తమకే 25 శాతం ఇవ్వాలని స్థానిక టీడీపీ నేతల పట్టు

ఓబులవారిపల్లె : టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న సంస్థకు ఖనిజం సరఫరా చేసే విషయంలో వాటా కోసం తమ్ముళ్ల మధ్య కుమ్ములాట మొదలైంది. 25 శాతం వాటా తమకే ఇవ్వాలంటూ స్థానిక టీడీపీ నాయకులు భీష్మించడంతో వాదోపవాదాలు జరిగాయి. బేరసారాలు బెడిసికొట్టడంతో టెండర్ దక్కించుకున్న కంపెనీ చివరికి సరఫరా నిలిపివేసింది. వివరాల్లోకి వెళ్తే.. మంగంపేట ఏపీఎండీసీ గనుల నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల ఏపీ ఎండీసీ నుంచి ఖనిజాన్ని కొనేందుకు బల్క్ టెండర్ ద్వారా ఎంప్రదా కంపెనీ దక్కించుకుంది. ఎపీఎండీసీ కంపెనీ ఖనిజాన్ని తరలించాల్సి ఉంది. దీనిపై కూటమి నాయకుల కన్ను పడింది. పెద్ద ఎత్తున తామే ఖనిజం తీయిస్తామని గతంలో ఒప్పందం చేసుకున్నారు. రోజూ దాదాపు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల మేర సరఫరా చేస్తున్నారు. అయితే ఇటీవల స్థానిక టీడీపీ నాయకుడు 25 శాతం ఖనిజం తీసేందుకు తమ యంత్రాలకు అవకాశం ఇవ్వాలని పటుబట్టారు. అంతకుముందు తరలిస్తున్న కూటమి నాయకులు దీనికి ఒప్పుకోకపోగా.. వాగ్వాదాం జరగడంతో వివాదం ముదిరింది. దీంతో దీనిపై శుక్రవారం ఉదయం నుంచి కూటమి నాయకుల మధ్య చర్చలు జరిగాయి. బేరసారాలు కుదరక పోవడంతో చివరకు ఏపీఎండీసీ నుంచి ఎమ్‌ప్రదా కంపెనీకి బెరైటీస్ ఖనిజం సరఫరా నిలిపివేశారు. ఏపీఎండీసీ గనుల నుంచి స్థానిక నిర్వాసిత కుటుంబీకులు, ఇల్లు కోల్పోయిన వారంతా లక్షల రూపాయలు అప్పుచేసి యంత్రాలు కొనుగోలు చేశారు. 51 ఇటాచీలు పెట్టి ఖనిజం తీస్తూ జీవనం సాగిస్తున్నారు. కూటమి నాయకులు తమకే వాటా కావాలనడంతో వీరి మధ్య వివాదం వారి జీవన స్థితిగతులకు అంటకంగా మారింది. కంపెనీకి ఖనిజం రవాణా చేసేలా చూడాలని యంత్రాల యజమానులు కోరుతున్నారు.



ఖనిజం సరఫరా నిలిచిపోవడంతో ఆగిన లారీలు

మున్సిపల్ వర్కర్లకు సంక్షేమ పథకాలేవీ?

రాయచోటి టౌన్ : మున్సిపల్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి నేతలు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కో కన్వీనర్ నేలపాటి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎదురుగా శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్, ఆప్కాస్ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. తక్షణమే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి రూ.24,500లకు వేతనం పెంచాలని కోరారు. జీవో నంబర్ 36 ప్రకారం వేతనం ఇవ్వాలని, కార్మికులకు ఆరు నెలల డీఏ, గ్రాట్యూటీ విడుదల చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవా, తిరుమల, చలపతినాయుడు, శేషాద్రిబాబు, కేశవరావు, వెంకటేష్, రాధ, చంద్ర, నరసింహులు, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న నాయకులు

పోక్సో కేసులో నిందితుడికి జైలుశిక్ష



చంద్రశేఖర్

మదనపల్లె రూరల్ : పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ చిత్తూరు పోక్సో కోర్టు జడ్జి ఎం.శంకరరావు శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిషావలి తెలిపారు. పట్టణంలోని సుభాష్ రోడ్డుకు చెందిన టి.చంద్రశేఖర్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలికల హైస్కూల్ వద్ద 2017 మార్చి, 3న స్కూల్‌కు వెళ్లే విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో అప్పటి హెచ్‌ఎం పద్మజ ఫిర్యాదు మేరకు, ఎస్ఐ మనోహర్ పోక్సో కేసు నమోదు చేశారన్నారు. కోర్టు విచారణ అనంతరం శుక్రవారం చిత్తూరు పోక్సో కోర్టులో నిందితుడు చంద్రశేఖర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ..5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శంకరరావు తీర్పునిచ్చారన్నారు. నిందితుడికి శిక్ష పడేలా చూసినందుకు వన్‌టౌన్ సీఐ ఎరిషావలి, చిత్తూరు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ టీసీ.సాయిసుధాకర్, కోర్టు కానిస్టేబుల్ ఖాదర్‌వలిలను డీఎస్పీ మహేంద్ర అభినందించారు.

చీటింగ్ కేసులో నిందితురాలిని అరెస్ట్



అపస్మారక స్థితిలో యువతి రోహిణి

మదనపల్లె రూరల్: చీటింగ్ కేసులో నిందితురాలైన యువతిని కేరళ పోలీసులు శుక్రవారం మదనపల్లెలో వన్‌టౌన్ పోలీసుల సాయంతో అరెస్ట్ చేశారు. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు నిందితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని బెంగళూరు రోడ్డు నక్కలదిన్నెలో ఉంటున్న సాయిబాబా కుమార్తె రోహిణి(25) 2023లో కేరళ ముక్కల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్థిక నేరానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి అక్కడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఏ-1గా ఉన్న రోహిణి, మదనపల్లెలో తలదాచుకుంది. కేసు దర్యాప్తులో భాగంగా ఆమె మదనపల్లెలో ఉన్నట్లు నిర్ధారించుకున్న కేరళ పోలీసులు ఇక్కడకు చేరుకుని వన్‌టౌన్ పోలీసుల సాయంతో అమెను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె, అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు డెటాల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యుల సాయంతో పోలీసులు ఆమెను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమెను అదుపులోకి తీసుకుని కేరళకు తరలించారు.

టీడీపీ నాయకుడిపై ఫిర్యాదు

రాజంపేట: టీడీపీ క్రియాశీలక కార్యకర్త సుండుపల్లె మండలం తిమ్మసముద్రానికి చెందిన జైష్టం వరుణ్‌పై టీడీపీ నేత చప్పిడి మహేష్‌నాయుడు, అతని అనుచరవర్గం దాడి చేసినట్లు సుండుపల్లె ఎస్ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలి వున్నాయి. మడితాడులో టీడీపీ సంస్థాగత ఎన్నికల క్రమంలో వరుణ్ అక్కడే ఉన్నారు. అక్కడి నుంచి కారులో వెళుతుండగా మహేష్‌నాయుడు అనుచరవర్గం తనపై దాడి చేశారని, విచక్షణా రహితంగా కట్టెలతో,ఇనుపరాడ్లతో దాడిచేయగా, ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగు తీశానని వరుణ్ తెలిపారు. తనపై దౌర్జన్యంగా వ్యవహరించి చంపేస్తామని, తమకు హత్య కేసులు కొత్తేమీకాదని బెదిరించారన్నారు. మహేష్‌నాయుడుతోపాటు రెడ్డిచెర్ల అశోక్, కోటకొండ చందు, షేక్ జుబేర్,మనోజ్‌నాయుడు, సంతోష్, నానీ, అశోక్‌నాయుడు, నిఖిల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో మహేష్‌నాయుడు పెత్తనంపై ప్రశ్నించడంతోనే వరుణపైకి దాడికి కారణమని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అట్లూరు : మండలంలోని కడప-బద్వేల్ రహదారిపై రెడ్డిపల్లె సమీపాన ద్విచక్ర వాహనం అదుపు తప్పి శుక్రవారం ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. బద్వేల్ మండలం గుంతపల్లెకు చెందిన పడిగె క్రిస్టఫర్ తన ద్విచక్ర వాహనంపై సిద్దవటం మండలం మాచుపల్లెకు వెళ్లి తిరిగి వస్తున్నారు. అట్లూరు మండలం రెడ్డిపల్లె సమీపాన కడప-బద్వేల్ రహదారిపై వేప చెట్టును ఢీకొని కింద పడ్డారు. తీవ్ర గాయాలైన క్రిస్టఫర్‌ను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

మదనపల్లె రూరల్ : ఎక్సైజ్ బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ సిబ్బంది గురువారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో 12.96 లీటర్ల ఎన్‌డీపీఎల్ కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి టూవీలర్ సీజ్ చేసినట్లు సీఐ సత్య శ్రీనివాస్ తెలిపారు. మీడియాతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... కర్నాటక సరిహద్దు చీకలబైలు చెక్‌పోస్టుకు సమీపంలో బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా, కురబలకోట మండలం తుంగావారిపల్లెకు చెందిన మూలి రమేష్(27), కర్నాటకకు చెందిన బెంగళూరు మాల్ట్ విస్కీ(90ఎం.ఎల్) 96 టెట్రా ప్యాకెట్లు, సుజుకీ ఆక్సెస్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి నుంచి రూ.3,840 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని, టూవీలర్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన పెద్దిగాని సోమశేఖర్(28), కర్నాటకకు చెందిన హైవార్డ్స్ ఛీర్స్ విస్కీ(90ఎం.ఎల్) 48 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. రెండు కేసుల్లోనూ ఇద్దరిని అరెస్ట్‌చేసి ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించామన్నారు.



వ్యక్తి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

18న చలో ఢిల్లీ

బద్వేలు అర్బన్ : కడపలో ఉక్కు పరిశ్రమ హామీ అమలు కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు.

మదనపల్లె పురపాలక సంఘము

ఆర్.ఓ.సి.నెం.553/F1/2020 తేది:11.07.2025

ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకు గాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ. నెం.	నిధులు	టెండరు ఐ.డి.లు	పనుల సంఖ్య	పనుల అంచనాల మొత్తము (ECV)
1.	పురపాలక సాధారణ నిధులు	828598, 828591, 828582	3	రూ.12,60,000
2		828615, 828613, 828608	3	రూ.2,83,305

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి **e procurement market Place** నందు చూడవలెను మరియు ఆఫీసు పనివేళలందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

వరుస నెం.1

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 11.07.2025 : 04.00 P.M
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు చివరి తేది : 16.07.2025 : 11.00 A.M
బిడ్ డాక్యుమెంట్ స్వీకరించుటకు చివరి తేది : 16.07.2025 : 11.15 A.M

వరుస నెం.2

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 11.07.2025 : 04.00 P.M
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు చివరి తేది : 25.07.2025 : 11.00 A.M
బిడ్ డాక్యుమెంట్ స్వీకరించుటకు చివరి తేది : 25.07.2025 : 11.15 A.M

షరతులు: ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు / నిరాకరించుటకు కమిషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

సం/- **కమిషనరు,** మదనపల్లె పురపాలక సంఘము